క్లుప్తంగా

నేడు 'గడప గడపకు..'

ఓడీచెరువు: మండలంలోని మామిళ్లకుంట్లపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం ఉదయం 8 గంటలకు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ రాజునాయుడు, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సమస్యలు తెలుసుకొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తల్లికి బాలుడి అప్పగింత



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న ధర్మవరం రైల్వే పోలీసులు

ధర్మవరం అర్బన్: ఇంటి నుంచి పారిపోయి వచ్చిన బాలుడిని రైల్వే జీఆర్పీ పోలీసులు బాలుడి తల్లికి అప్పగించారు. ధర్మవరం రైల్వే ఆర్పీ ఎస్ఐ గోపీకుమార్, హెడ్ కానిస్టేబుల్ షణ్ముఖానందరెడ్డి తెలిపిన మేరకు.. అనంతపురం పట్టణానికి చెందిన కుమార్ అనే బాలుడు ఇంట్లో రూ.16 వేల నగదు తీసుకుని సెల్‌ఫోన్ కొన్నందుకు తల్లి సునీత మందలించింది. దీంతో ఆదివారం అనంతపురం నుంచి రైలులో హైదరాబాద్ వెళ్లాలని గుంతకల్లులో దిగాడు. అక్కడి నుంచి హంపి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి ధర్మవరం రైల్వేస్టేషన్‌లో దిగాడు. ప్లాట్ ఫారంపై తచ్చాడుతూ తిరుగుతున్న కుమార్‌ను పోలీసులు విచారించగా ఇంటి నుంచి పారిపోయి వచ్చినట్లు తెలిపాడు. దీంతో తల్లి సునీతకు ఫోన్ చేసి రమ్మని చెప్పి బాలుడిని అప్పగించారు.

మాట నిలబెట్టుకున్న జగనన్న



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన మాటను సీఎం వైఎస్ జగనన్న నిలబెట్టుకున్నారని బుక్కపట్నం ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. 'వైఎస్సార్ వాహనమిత్ర' పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు రూ. 10 వేలు జమ చేసిన సందర్భంగా బుక్కపట్నం మండలం మారాల గ్రామ పంచాయతీలో ఆటో యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, మండల అగ్రిబోర్డు చైర్మన్ వెంకటచౌదరి, నాయకులు గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

అధిక ధరలకు స్టాంపులు విక్రయిస్తున్నారని ఫిర్యాదు



ఏఓకు వినతిపత్రం అందిస్తున్న ప్రసాద్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద అధిక ధరలకు స్టాంపులు విక్రయిస్తున్న స్టాంపు వెండర్ల లైసెన్సులు రద్దు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇడపబత్తిని ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఏఓ ఖతిజున్ కుబ్రాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రూ.100 స్టాంపును రూ.200 నుంచి రూ.300కు విక్రయిస్తున్నారని తెలిపారు. ప్రశ్నిస్తే స్టాంపులు ఇవ్వమని, సర్వర్ పనిచేయలేదని చెబుతున్నారని ఆరోపించారు. స్టాంపు వెండర్లపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

సత్ప్రవర్తనతో మెలగండి

బత్తలపల్లి: సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ పి.శ్రీనివాసులు వివిధ కేసుల్లో నిందితులు, పాత నేరస్తులకు సూచించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రౌడీ షీట్లను తొలగించేందుకు చాలా కష్టపడాల్సి ఉంటుందన్నారు. ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు. ప్రశాంతంగా జీవించాలని, మంచిగా మసలుకోవాలని సూచించారు.

కురుబలు రాజకీయంగా రాణించాలి

రామగిరి: కురుబలు రాజకీయంగా రాణించాలని కురుబ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని పేరూరులో కలకందప్ప ఆలయంలో కురుబలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 19న అనంతపురంలో కురుబల గుడికట్ల సంబరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సంబరాల్లో ఉమ్మడి జిల్లా వాసులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. సంఘం ఉపాధ్యక్షుడు పిడుగు కృష్ణమూర్తి, కర్తనపర్తి శాంతమూర్తి, టీచర్ల సంఘం అధ్యక్షుడు కమతం ఈశ్వరయ్య, కురుబ తిమ్మారెడ్డి తదితరులున్నారు.

ఇంటింటా 'సంక్షేమం' వివరిద్దాం

- బాబు అవినీతిని ప్రజలకు తెలియజేద్దాం
- వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



హాజరైన గృహ సారథులు, నాయకులు, కార్యకర్తలు

ముదిగుబ్బ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి తెలియజేద్దామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని షాదీమహల్‌లో సోమవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' అనే కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యే వరకు సైనికుల్లా పనిచేయాలని కోరారు. జగనన్న జనరంజక పాలనను ప్రజలకు వివరించాలని సూచించారు. కుటుంబానికి మంచి జరిగి ఉంటేనే ఆశీర్వదించాలని గర్వంగా చెప్పుకునే ఏకైక ముఖ్యమంత్రి జగన్ ఒక్కరే అని పేర్కొన్నారు. జనం మద్దతు జగన్‌కేనని నిరూపిద్దామన్నారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు అమలు చేసి చూపించామన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని జగనన్న సాకారం చేశారన్నారు. నవరత్నాల ద్వారా ప్రతి కుటుంబం లబ్ధి పొందిందా లేదా తెలుసుకొని మరోసారి జగన్‌ను ఆశీర్వదించాలని ప్రజలను కోరే బాధ్యత మీపై ఉందన్నారు. టీడీపీ నాయకులు చేసే విష ప్రచారాన్ని తిప్పికొడుతూనే బాబు అవినీతిని వివరించాలని కోరారు.

14 ఏళ్ల సీఎం ఏం చేశారు..

20 పేజీల మేనిఫెస్టో ప్రకటించిన చంద్రబాబు అందులో ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని ఎమ్మెల్యే కేతిరెడ్డి విమర్శించారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, 14 ఏళ్లు సీఎంగా చేశానని చెప్పుకొనే ఆయన అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మిగిలిపోయాడన్నారు. కోట్లాది రూపాయలను కాజేసి జైలుకు వెళ్లాడన్నారు. అక్రమంగా అరెస్ట్ చేశారని అన్నారే తప్ప, తాను తప్పు చేయలేదని ఒక్క రోజు కూడా ఆయన అనలేదన్నారు. రకరకాల పిటిషన్లు వేసి కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సింహంలా ఒంటరిగానే పోటీ చేస్తుందన్నారు. రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు లేకనే టీడీపీ, జనసేన పార్టీలు పొత్తు పెట్టుకున్నాయని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వస్తే వైఎస్సార్‌సీపీ నాయకుల తాట తీస్తామని, బట్టలు ఊడదీస్తామని అంటారే తప్ప ప్రజలకు మంచి చేస్తామని చెప్పలేని పరిస్థితుల్లో ఉన్నారని విమర్శించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఎవరిని గెలిపించాలో వారికి తెలుసని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సీవి నారాయణరెడ్డి, మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్లు భాస్కర్, రంజిత్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు తాడిమర్రిలో..

తాడిమర్రి: తాడిమర్రిలో మంగళవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' అనే కార్యక్రమంపై సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం ఆవరణంలో సాయంత్రం 3.30 గంటలకు జరగనున్న కార్యక్రమంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి పాల్గొంటారన్నారు.

ఎన్పీ కుంటలో నేడు..

ఎన్పీకుంట: స్థానిక శివాలయం వద్ద గల ఫంక్షన్‌హాలులో మంగళవారం ఉదయం 10 గంటలకు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంపై సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఈటెరాము, కన్వీనర్ కొత్తరంగారెడ్డి సోమవారం తెలిపారు. ఎమ్మెల్యే సిద్దారెడ్డి పాల్గొని జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు దిశానిర్దేశం చేయనున్నట్లు వివరించారు.

బాధ్యతల స్వీకరణ

పుట్టపర్తి టౌన్: జిల్లా డీసీఆర్‌బీ సీఐగా శ్రీహర్ష సోమవారం పోలీసు కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఎస్పీ మాధవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: గతంలో ఎన్నడూ లేని విధంగా తమ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కే. బ్రాహ్మణపల్లి నుంచి ఎగువపల్లి వరకు రూ.1.73 కోట్లతో నూతనంగా వేసిన తారురోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో నియోజకర్గంలో 135 గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించామన్నారు. దశాబ్దకాలం నుంచి రాకపోకలకు నోచుకోని గ్రామాలకు సైతం అప్రోచ్ రోడ్లు వేశామన్నారు. దీంతో 108,104 వాహనాలు మారుమూల గ్రామాలకు వెళ్తున్నాయన్నారు. ఏకకాలంలో సంక్షేమం, అభివృద్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పరుగులు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ పాలనలో దోచుకోవడం, దాచుకోవడం మాత్రమే జరిగిందన్నారు. అనంతరం ఎగువపల్లి ప్రాథమిక పాఠశాలలో 'జగనన్న ఆరోగ్యసురక్ష' కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ ఈశ్వరయ్య, లోకేష్, కుమార్‌నాయుడు, నాయకులు మధుసదన్‌రెడ్డి, మండల కన్వీనర్ ప్రకాష్, సింగిల్ విండో అధ్యక్షులు ప్రసాద్, గరుడప్ప తదితరులున్నారు.

నాలుగేళ్లలో రూ. 2.40 లక్షల కోట్ల లబ్ధి

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి



అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల లబ్ధిపై ముద్రించిన పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి

పుట్టపర్తిరూరల్: తమ ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లలోనే ప్రజలకు రూ. 2.40 లక్షల కోట్ల లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి అన్నారు. సోమవారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' అనే కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పుట్టపర్తిలో మరో మారు వైఎస్సార్ సీపీ జెండా ఎగరేద్దామన్నారు. వైఎస్ జగన్ ఆశీస్సులతో పుట్టపర్తిలో అభివృద్ధి, సంక్షేమం పెద్ద ఎత్తున జరిగిందన్నారు. ఈ విషయాలను ప్రతి ఇంటా వివరిద్దామన్నారు. చంద్రబాబు హయాంలో జరిగిన అవినీతి గురించి ప్రజలకు చెబుదామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల కోసం రూ. 12 వేల కోట్లకుపైగా ఖర్చు చేశామన్నారు. బాబా సోదరుడు దివంగత జానకీ రామయ్య స్వప్నం శ్రీసత్యసాయి జిల్లా అని, సీఎం జగన్ ఆశీస్సులతో దాన్ని సాధించామన్నారు. రూ.1,750 కోట్లతో ఎన్‌హెచ్ 342 కోడూరు నుంచి ముదిగుబ్బ వరకూ, రూ. 2 వేల కోట్లతో బెంగుళూరు, విజయవాడకు వెళ్లే గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేను పుట్టపర్తి, ఓడీసీ, నల్లమాడ మండలాల మీదుగా తీసుకొచ్చామన్నారు. రూ. 900 కోట్లతో మరో జాతీయ రహదారి నల్లమాడ, ఓడీసీ మండలాల మీదుగా పనులు జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో 193 చెరువులను కృష్ణాజలాలతో నింపే కార్యక్రమానికి రూ. 860 కోట్ల విడుదలకు పాలన అనుమతులు పొందామన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ దగ్గర మోకరిల్లి హిందూపురం జిల్లా ఏర్పాటుకు సంతకం చేసిన ఘనుడు పల్లె రఘునాథ్ రెడ్డి అని ఆరోపించారు. మంత్రిగా, ప్రభుత్వ విప్‌గా పనిచేసినా ఈ ప్రాంతానికి ఏమీ చేయలేని వ్యక్తి మరో అవకాశం ఇవ్వండి అని కోరడం సిగ్గుచేటన్నారు. టీడీపీ హయాంలో కరువు కాటకాలు ఏర్పడ్డాయని, తమ నాలుగేళ్ల పాలనలో బుక్కపట్నం చెరువు కానీ, చిత్రావతి నది కానీ ఏ రోజు ఎండిపోలేదని వివరించారు. కార్యక్రమంలో పుట్టపర్తి అర్బన్ కన్వీనర్ బీడుపల్లి రంగారెడ్డి, కౌన్సిలర్లు తిప్పన్న, ఓబుళపతి, సాయిలీల రమణ, చెరువు భాస్కర్ రెడ్డి, సూర్యగౌడ, మున్సిపల్ విప్ సాయిగీత, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, కో ఆప్షన్ మెంబర్లు అగరబత్తి రాజు, రఫీ, మున్సిపాలిటీ అబ్జర్వర్లు రమణారెడ్డి, నాగభూషణ, నాయకులు డాక్టర్ గోపాల్ రెడ్డి, కులశేఖర్ రాజు, కత్తి నాగిరెడ్డి, కత్తి మల్లి రెడ్డి, మిద్దె గోపాల్ రెడ్డి, పరశురాం నాయక్, మెప్మా అధ్యక్షురాలు సాయిలీల, గోకులం కవిత, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమం

కొత్తచెరువు: పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందించామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని నారేపల్లి, కేశాపురం పంచాయతీల్లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తచెరువు మండలానికి నాలుగు వేల ఇళ్లు మంజూరు చేశామన్నారు. జిల్లా ప్రకటనతో రైతుల భూముల ధరలు అమాంతం పెరిగాయన్నారు. పార్టీ మండల కన్వీనర్ నారేపల్లి జగన్మోహన్ రెడ్డి, పుట్టపర్తి ఎంపీపీ రమణారెడ్డి, జెడ్పీటీసీ భర్త మటన్ శంకర్, సర్పంచ్‌లు నరేంద్రరెడ్డి, ప్రకాష్, లాయర్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సంజీవ రెడ్డి, మాజీ డీలర్ రమణారెడ్డి,విశ్వనాథ్, సచివాలయ కన్వీనర్ రాధమ్మ, నారాయణస్వామి, కేశప్ప, చంద్రమోహన్ రెడ్డి, నరసింహారెడ్డి, మహబూబ్ బాషా, పెద్దిరెడ్డి, కేశవరెడ్డి, మునెమ్మ, నాగిరెడ్డి, తదితరులున్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం



కొర్తికోటలో సామూహిక శ్రీమంతాలు

కదిరి టౌన్: 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిరుపేదలకు వరం లాంటిదని మున్సిపల్ కమిషనర్ శ్రీవారిబాబు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని మశానంపేట మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం వార్డు కౌన్సిలర్ కేఎస్ దిల్షాదున్నీసా ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్, వార్డు కౌన్సిలర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి సహకారంతో రూ. 3 కోట్లతో 4 అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేశారన్నారు, అనంతరం అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేఎస్ బహుద్దీన్,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొర్తికోటలో..

తనకల్లు: మండల పరిధిలోని కొర్తికోట గ్రామ సచివాలయంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో పలువురు రోగులకు చికిత్స చేసి మందులను అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు చేశారు. పౌష్టికాహార ఆవశ్యకతను తెలియజేశారు. తహసీల్దార్ శోభ సువర్ణమ్మ, ఈఓఆర్డీ ఆనందయ్య, ఎంపీటీసీ ఆదినారాయణ, నాయకులు గంగప్ప నాయుడు, కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గుడ్డంపల్లి తండాలో..

ముదిగుబ్బ: మండల పరిధిలోని గుడ్డంపల్లి తండాలో సోమవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కంటి చూపు సరిగా లేని వారికి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పృథ్వీనాయక్, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ రమణప్ప, గుంజేపల్లి సర్పంచ్ సంధ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు సేవేనాయక్, చిన్న తిరుపాల్‌నాయక్, నాగేంద్ర నాయక్, రాజేష్ నాయక్, వైద్య సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

304 మందికి వైద్య పరీక్షలు

కనగానపల్లి: మండలంలోని తూంచర్లలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 304 మందికి వైద పరీక్షలు చేసినట్లు పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య శిబిరం ఏర్పాటు చేసి చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ ప్రారంభించగా, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షించారు. కంటి సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడే 18 మందిని ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనిల్‌కుమార్, ఎంపీహెచ్ఈఓ మనోహర్, హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీనివాసులు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కన్వీనర్ అమరనాథరెడ్డి, నాయకులు నాగముని, రమణారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అందరికీ వైద్యం

కొత్తచెరువు: అందరికీ వైద్యం అందించాలన్న ధ్యేయంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని ఎంపీపీ గాయత్రి తెలిపారు. సోమవారం తలమర్ల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామాంజినేయ రెడ్డి, సర్పంచ్ రత్నమ్మ, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎన్పీకుంట: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని పంచాయతీ కార్యదర్శి రమేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నరసమ్మ అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో సోమవారం రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ బాల్యంలోనే వివాహాలు చేయడం వలన భవిష్యత్తులో తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించారు. బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే చైల్డ్‌కేర్ హెల్ప్ లైన్ 1098కు సమాచారం అందించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నరసమ్మ, మహిళా పోలీస్ లలితకళ, రెడ్స్ సంస్థ కమ్యూనిటీ సోషల్ వర్కర్ రవీంద్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు జరగకుండా చూద్దాం

బత్తలపల్లి: బాల్య వివాహాలు జరగకుండా నియంత్రించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని భారతి మండల సమాఖ్య కార్యాలయంలో ఆన్‌లైన్‌లో అవగాహన కల్పించారు. పంచాయతీరాజ్‌శాఖ, గ్రామీణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ రాజశేఖర్, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యనిర్వహణాధికారి ఎండీ ఇంతియాజ్ మాట్లాడుతూ బాల్య వివాహరహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించుటలో స్వయం సహాయక సంఘాలు, సభ్యుల పాత్ర కీలకమన్నారు. ప్రమాణం చేయించారు. ఏపీఎం సుదర్శన్‌రాజు సభ్యులందరికీ బాల్య వివాహ నిషేధ చట్టం 2006 గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ లీడర్లు, సీసీలు సుధాకర్, వెంకటసత్యం, శంకర్, నాగానంద్, ఎల్బీ సీసీ లక్ష్మీనారాయణ, అకౌంటెంట్ గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

పట్నంలో ర్యాలీ..

కదిరి అర్బన్: మండల పరిధిలోని పట్నం గ్రామంలో సోమవారం బాల్యవివాహాలపై గ్రామ సమైఖ్య సంఘం ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ బాల్యవివాహాలతో ఎన్నో అనర్థాలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీ నిర్మల, యానిమేటర్లు రాజు,రాజేశ్వరీ, గ్రామ సమైఖ్య లీడర్ మల్లికా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

రామగిరి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేద్దామని ఆపార్టీ మండల కన్వీనర్ కత్రా హనుమంతరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని పేరూరు, పెద్దకొండాపురం, ఎంసీపల్లి పంచాయతీ సచివాలయాల్లో పార్టీ నూతన కమిటీలను ఎంపిక చేశారు. ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు మీనుగ నాగరాజు, రాజేష్, సిద్దన్న, మండల అగ్రిబోర్డు చైర్మన్ నరసింహారెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, నర్సిరెడ్డి, రామ్మూర్తి, మంజునాథ్, గుడుసాల వెంకటేశులు, ఈశ్వరయ్య, వెం కటరెడ్డి, బాలరాజు, పల్లి నారాయణ, అక్కులప్ప తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఓడీచెరువు: మండల పోలీసులు సోమవారం కర్ణాటక మద్యం పట్టుకున్నారు. మండలకేంద్రంలోని చర్చి వీధికి చెందిన శ్రీరాములును అరెస్టు చేశారు. 192 కర్ణాటక టెట్రాపాకెట్లు, 90 ఎంఎల్ హైవాట్స్ బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

దాడి కేసులో నిందితులకు రిమాండ్

నల్లచెరువు: దామవాండ్లపల్లికి చెందిన జి.జయరాం అనే వ్యక్తిపై దాడికి పాల్పడిన కేసులో కదిరి కోర్టు ఇద్దరికి 14 రోజులు రిమాండ్ విధించింది. ఎస్ఐ లింగన్న తెలిపిన మేరకు.. ఆగస్టు 21న జయరాంపై అదే గ్రామానికి చెందిన టి.గణేష్, టి.గంగరాజులు కర్రలు,ఇటుకలతో తలపై తీవ్రంగా గాయపరిచారు. ఫిర్యాదు మేరకు సోమవారం నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు.

మట్కా బీటర్ల అరెస్టు

కదిరి టౌన్:షామీరియా వీధికి చెందిన ముబారక్, మోదిన్‌ఖాన్‌లు మట్కా ఆడిస్తుండగా పట్టుకున్నట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. వారి నుంచి రూ. 50 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఇరు వర్గాల ఘర్షణ

అమృతవల్లి డిగ్రీ కాలేజ్ వద్ద ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగిందని సీఐ నారాయణరెడ్డి తెలిపారు. కస్తూరిబాయి వీధికి చెందిన చెందిన దిలీప్‌కుమార్‌పై అడపాలవీధికి చెందిన తిమ్మరాజు,జెట్టి అంజనేయులు, ఉదయ్, భారత్‌కుమార్, గణేష్, కార్తీక్‌లు కత్తితో పొడిచి గాయపరిచారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.



ధర్మవరంలో గాయత్రిదేవిగా చెన్నకేశవస్వామి



కూర్మావతారంలో వేంకటేశ్వరస్వామి



బత్తలపల్లి: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



ధైర్యలక్ష్మిగా కన్యకాపరమేశ్వరీ



బాల త్రిపురసుందరీ దేవిగా సత్తెమ్మ

కరుణించు తల్లీ!

పుట్టపర్తి టౌన్: శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం పుట్టపర్తి పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. సత్యసాయి బాబా ప్రతిష్ఠించిన సత్యమ్మ దేవత బాలత్రిపురసుందరిగా, చిత్రావతి నది ఒడ్డున ఉన్న దుర్గమ్మ గాయత్రి దేవిగా దర్శనం ఇచ్చారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారు ధైర్యలక్ష్మిగా భక్తులను కటాక్షించారు.

బత్తలపల్లి: బత్తలపల్లి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు, శ్రీలలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వరుడు ఆలయంలో, కొల్లాపురమ్మ, బళ్లారి దుర్గమ్మ, సంజీవపురం సమీపంలోని కాటికోటేశ్వరక్షేత్రంలోని మహంకాళీమాత ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ, ఉప సర్పంచు కోటి గోపీనాథ్, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్‌కుమార్, తదితరులున్నారు.

తాడిమర్రి: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత సోమవారం గాయత్రీ మాతగా కొలువుదీరింది. మూలవిరాట్‌ను అందంగా అలంకరించారు.

ధర్మవరం అర్బన్: శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా సోమవారం ఆలయాల్లో స్వాములు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

నల్లచెరువు: మండల కేంద్రంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రులను పురస్కరించుకుని అమ్మవారు గాయత్రి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

శ్మశాన వాటిక కబ్జా కాకుండా చూడండి

బత్తలపల్లి: మండల కేంద్రంలో శ్మశాన వాటిక కబ్జా కాకుండా చూడాలని సీపీఐ నాయకులు, రైతు సంఘం నాయకులు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. భూ సర్వే తహసీల్దార్ సునీతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, సీపీఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్ మాట్లాడుతూ హిందూ శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి తిరుపాలు, ఓబులేసు, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.